

పరిమితికి మించి విద్యార్థుల తరలింపు తగదు

రవాణా శాఖాధికారికి ఎస్ఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలోని ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థల బస్సుల్లో పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి గణేష్ డిమాండ్ చేశారు. పరిమితికి మించి బస్సుల్లో విద్యార్థులను తరలిస్తున్న విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రవాణాశాఖాధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్నాయని ఆరోపించారు. ఫిట్‌నెస్ లేని, అనధికారిక బస్సులు నడుపుతున్నారని ఆరోపించారు. వీటిపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు లక్ష్మణ్ పవన్ తదితరులు పాల్గొన్నారు

జిల్లా పరిషత్.. వాడీ వేడీ..!



సమావేశంలో మాట్లాడుతున్న జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

ఉమ్మడి జెడ్‌పి సర్వసభ్య సమావేశంలో సమస్యలపై ఎంఎల్ఎల నిలదీత

తమ ప్రాంత సమస్యలపై ఏకరువు పెట్టిన స్థానిక ప్రజాప్రతినిధులు

వ్యవసాయం, వైద్యం, విద్య శాఖలపై ప్రశ్నల వర్షం

జెడ్‌పి ఛైర్‌పర్సన్‌పై 'చింతమనేని' ఆగ్రహం

తూర్పుగోదావరి ఉన్నతాధికారులు రాకపోవడంపై నేతల అసహనం

రైతాంగానికి అండగా ఉంటాం: మంత్రి నిమ్మల

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన మొదటి సర్వసభ్య సమావేశంలో ఎంఎల్ఎలు, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ అధ్యక్షతన శుక్రవారం ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్‌తోపాటు ఎంఎల్ఎలు బడేటి చంటి, పత్సమట్ల ధర్మరాజు, సొంగా రోషన్‌కుమార్, ఆరిమిల్లి రాధాకృష్ణ, ముప్పిడి వెంకటేశ్వరరావు, మద్దిపాటి వెంకటరాజు, చింతమనేని ప్రభాకర్, కలెక్టర్ వెట్రిసెల్వి, పశ్చిమ జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, డిఎఫ్ఒ రవీంద్ర ధామా, జెడ్‌పి సిఇఒ డి.సుబ్బారావుతోపాటు జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఎజెండాలో భాగంగా తొలుత వ్యవసాయశాఖపై చర్చలో ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ, ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గడిచిన జులైలో వచ్చిన వరదలకు యనమదుర్రు డ్రెయిన్ కింద పంట పొలాలన్నీ ముంపునకు గురయ్యాయన్నారు. వయ్యేరు కాలువ పూడికతీత వంటి కార్యక్రమాలను ఐదేళ్లుగా నిర్లక్ష్యం వహించడంతో ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. వెంటనే ఆ పనులు పూర్తి చేయాలన్నారు. గత పాలకులు ధాన్యం కొనుగోలును అస్తవ్యస్తంగా మార్చేశారన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రైతులు ధాన్యం ఎక్కడ అమ్ముకోవాలో తెలియక ఇబ్బంది పడ్డారని, ధాన్యం కొనుగోళ్లపై నూతన విధానాన్ని తీసుకొచ్చి రైతులకు మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. మద్దిపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కొవ్వూరు నియోజకవర్గంలో కొవ్వాడ కాలువ పనులు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను పరిష్కరించాలని కోరారు. గోదావరి పక్కనే ఉన్నా బోరు నీళ్లు తాగాల్సిన దుస్థితి ఉందన్నారు. దీంతో కిడ్నీ, లివర్, మోకాళ్ల నొప్పుల సమస్యలు వస్తున్నాయన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ కౌలుదార్లకు ఇప్పి సాఫీగా బ్యాంకు రుణాలు అందించాలన్నారు. జలజీవన్ మిషన్‌లో తాగునీరు అందించకుండా నిర్లక్ష్యం ప్రదర్శించారని ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆసుపత్రుల్లో కనీస సౌకర్యాలు నిల్

వైద్యఆరోగ్యశాఖ సమీక్షలో భాగంగా ఎంఎల్ఎలు, స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులకు పలు ప్రశ్నలు సంధించారు. జంగారెడ్డిగూడెం, చింతలపూడి ఆసుపత్రుల్లో బెడ్‌షీట్ల నుంచి పరీక్షల వరకూ అనేక సమస్యలున్నాయని ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ లేవనెత్తారు. తణుకు జిల్లా ఆసుపత్రిలో సమస్యలపై ఆరిమిల్లి, కొవ్వూరు ఆసుపత్రిలో సమస్యలపై ముప్పిడి, దెందులూరు ఆసుపత్రిలోని సమస్యలపై చింతమనేని ప్రభాకర్, గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ల్యాబ్‌టెక్నీషియన్ లేరంటూ స్థానిక ప్రజాప్రతినిధులు ప్రశ్నల వర్షం కురిపించడంతో అధికారులు ఉక్కిరిబిక్కిరయ్యారు. నిడదవోలు ఆసుపత్రిలో పడకల పెంపునకు సంబంధించి అనుమతులు, సాగిన ప్రక్రియపై మంత్రి కందుల దుర్గేష్ సైతం అసహనం వ్యక్తంచేశారు. విద్యాశాఖపై చర్చలో ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ నాడు-నేడు పనులు ఎక్కడా పూర్తికాలేదని ధ్వజమెత్తారు. ఆర్అండ్‌బి, గృహనిర్మాణం వంటి ఇతర శాఖలపై చర్చల్లో ప్రజాప్రతినిధులు పలు సమస్యలను సమావేశంలో ప్రస్తావించారు. తూర్పుగోదావరి జిల్లా ఉన్నతాధికారులు సమావేశానికి రాకపోవడంపై నేతలు అసహనం వ్యక్తం చేశారు.

రైతాంగానికి అండగా ఉంటాం: మంత్రి నిమ్మల

మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాపై సిఎంకు ప్రత్యేక అభిమానం ఉందన్నారు. జిల్లాలో 80 శాతం ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారని, రైతాంగానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. తమ ప్రభుత్వం రాగా డ్రెయిన్లు, కాల్వల్లో తూడు, గుర్రపు డెక్క యుద్ధప్రాతిపదికన తొలగించిందన్నారు. భూయజమానితో సంబంధం లేకుండా విఆర్ఒ సంతకంతో కౌలుకార్డులు ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇ-క్రాప్‌లో కౌలురైతుల పేర్లు నమోదు చేయపోవడంతో ప్రభుత్వ సాయం అందడం లేదన్నారు. ఈ పరిస్థితిలో మార్పు తెస్తామన్నారు. రోడ్ల నిర్మాణం జరుగుతుందన్నారు. జిల్లాను అభివృద్ధి, సంక్షేమంలో ముందుకు తీసుకెళ్తామన్నారు. జెడ్‌పి ఏడుస్థాయీ సంఘాలు నూతన ఎంపీలు, ఎంఎల్ఎలతో కొత్తగా ఏర్పాటు చేశారు.

ఎజెండా పుస్తకాలపై మారని తీరు

గతంలో ఎజెండాలోని అంశాలతోపాటు జిల్లాలోని ఇతర శాఖల సంబంధించిన సమాచారంతో పుస్తకాలు ముద్రించి ప్రజాప్రతినిధులకు, మీడియాకు అందించేవారు. గత ప్రభుత్వ పాలనలో దీనికి తిలోదకాలు ఇచ్చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సైతం అధికారుల తీరులో మార్పు రాలేదు. ఎంఎల్ఎలకు తప్ప ఎజెండా పుస్తకాలు ఎవ్వరికీ ఇవ్వలేదు.

జెడ్‌పి ఛైర్‌పర్సన్‌పై చింతమనేని ఆగ్రహం

వైద్యఆరోగ్యశాఖపై చర్చలో భాగంగా దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ దెందులూరు సిహెచ్‌సిలో ఎక్స్‌రే సంబంధించిన మిషన్ కొనుగోలు చేశారని, అవి ఇక్కడ లేకపోవడంపై వైద్యఆరోగ్య శాఖాధికారులను నిలదీశారు. ఈ సందర్భంగా జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ జోక్యం చేసుకుని సబ్జెక్ట్‌పై మాట్లాడాలని అనడంతో చింతమనేని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ప్రజాప్రతినిధులుగా మాకు కొన్ని ఆలోచనలు ఉన్నాయి. సమావేశంలో ప్రస్తావించడానికి మాకు హక్కు ఉంది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ జరగాల్సిన మీటింగ్‌ను సాయంత్రం ఏర్పాటు చేసి మాట్లాడొంటే ఎలా? ఎజెండా పూర్తవుతుంది. ముఖ్యమైన సమావేశంలో ఏ ఒక్కరూ సమయం ఏమిటి. నా అభిప్రాయం చెప్పడానికి ఇదొక వేదిక. కొవ్వలి గ్రామానికి చెందిన 50 మంది జ్వరాలతో దెందులూరు ఆసుపత్రిలో ఉన్నారు. ఇప్పటి వరకూ జిల్లా అధికారులు కనీసం ఆవైపు కన్నెత్తి చూడలేదు. నేను మాట్లాడి తహశీల్దార్, ఎంపిడిఒను పంపించాను. ఇది జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు తమ సమస్యలను చెప్పుకునే వేదిక. ఇక్కడ వారికి మాట్లాడే సమయం లేకుండా పోయింది. గతంలో ఇలాంటి పరిస్థితి ఉండేది కాదు. అధికారులతో ఎంఎల్ఎలకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలి' అని చింతమనేని ప్రభాకర్ కలెక్టర్‌ను కోరారు. మంత్రి నిమ్మల రామానాయుడు సర్ది చెప్పడంతో చింతమనేని శాంతించారు.

పెన్షన్ల పంపిణీకి సర్వం సిద్ధం

సెప్టెంబర్ పెన్షన్ ఒకరోజు ముందుగానే పంపిణీ

2,31,075 మంది లబ్ధిదారులకు రూ.96.36 కోట్లు పంపిణీకి చర్యలు

ప్రతి మండలానికీ ఒక ప్రత్యేక అధికారి నియామకం

పంపిణీలో 4428 మంది సిబ్బంది

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో పెన్షన్ల పంపిణీకి అధికార యంత్రాంగం సర్వం సిద్ధమైంది. సెప్టెంబర్ నెల పెన్షన్ ఒక రోజు ముందుగానే పంపిణీ చేసేందుకు అన్ని చర్యలూ చేపట్టింది. సామాజిక పింఛన్ల పథకం ప్రవేశ పెట్టిన తరువాత ఒకటో తేదీకి ముందే అందించటం ఇదే మొదటిసారి. గతంలో ఒకటో తేదీన సెలవు వస్తే ఆ తర్వాత రోజున పెన్షన్ ఇచ్చేవారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి జిల్లాలో పెన్షన్ల పంపిణీకి అధికారులను సమాయత్తం చేశారు. జిల్లాలో రెండు లక్షల 31 వేల 75 మంది పెన్షన్ లబ్ధిదారులు ఉన్నారు. వీరికి రూ.96 కోట్ల 36 లక్షలు పంపిణీ చేయనున్నారు. దీనికి 4,428 మంది సిబ్బందిని వినియోగిస్తున్నారు. పెన్షన్ల పంపిణీ పరిశీలనకు మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, తహశీల్దార్లతోపాటు ప్రతి మండలానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించారు. దీనిలో భాగంగా శుక్రవారమే సచివాలయాల వారీగా నగదును అందించారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి పింఛన్ల పంపిణీకి శ్రీకారం చుట్టనున్నారు. 31న పింఛన్లు తీసుకోని వారికి సెప్టెంబరు 2న ఇచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

వెంటాడుతున్న వర్షం

శనివారం ఉదయం నుంచి పెన్షన్ల పంపిణీ జరగనుంది. అయితే వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచి జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. అయితే ఈ వర్షాలు శని, ఆదివారాల్లో కొనసాగే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ఒకరోజు ముందుగానే పెన్షన్ సొమ్మును అందించాలనే ప్రభుత్వ లక్ష్యం ఎంతవరకూ నెరవేరుతుందో వేచిచూడాలి.

మానవ మనుగడకు మొక్కలు పెంచాలి

వన మహోత్సవంలో కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం



మొక్కలు నాటుతున్న కలెక్టర్ నాగరాణి

మొక్కలతోనే మానవుని జీవనాధారం ముడిపడి ఉందని, మానవుల మనుగడకు మొక్కలు పెంచాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బేతపూడి జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో ఆమె ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. తొలుత బేతపూడి మెయిన్ రోడ్డు వద్ద వారు మొక్కలు నాటారు. అనంతరం జిల్లా పరిషత్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ వర్షమొస్తున్నా ప్రకృతి ప్రేమికులు, వృక్ష ప్రేమికులు ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. కుమ్మరి, కమ్మరి, కొయ్య బొమ్మలు, నిర్మాణ సామగ్రి, రైతుకు నాగలి, పేపరు, ప్రతిరోజు మనం వినియోగించే ఎన్నో వస్తువులు మొక్క ద్వారా వచ్చే కలపతోనే తయారవుతాయని గుర్తుంచుకోవాలన్నారు. మనకు ప్రాణాధారమైన వాయువును అందించడంతోపాటు దైనందిన జీవితంలో కూడా మిళతమై ఉన్నది ఒక్క మొక్క మాత్రమేనని గుర్తించాలన్నారు. మొక్కలను పెంచకపోతే భవిష్యత్తులో మానవుడి మనుగడే ప్రశ్నార్థకమవుతుందని హెచ్చరించారు. ఎంఎల్ఎ అంజిబాబు మాట్లాడుతూ ఒక పెరటిలో వేప చెట్టు ఉంటేనే జ్వరాలు, కామెర్లు వంటి వాటికి దూరంగా ఉండొచ్చని, ఇటువంటి ఔషధ గుణాలు కలిగి ప్రకృతి ప్రసాదించిన వరం మనం మొక్కలు నాటడం ద్వారా సమకూర్చుకోవాలన్నారు. మొక్కలు పెంచడం కష్టమైనా శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందన్నారు. జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పర్యావరణంలో విపరీతమైన మార్పులు చోటుచేసుకున్న కారణంగా సీజన్‌తో సంబంధం లేకుండా వాతావరణంలో వేడి పెరిగిపోయిందన్నారు. ప్రభుత్వ సూచనల మేరకు 50 శాతం మేర పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు. తొలుత ఎంఎల్ఎ అంజిబాబు మొక్కలు నాటడం, పర్యావరణ పరిరక్షణపై అందరితో ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల ఆవరణలోని జాతీయ నాయకులకు, తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. కలెక్టర్, ఎంఎల్ఎ చేతుల మీదుగా విద్యార్థులకు, గ్రామస్తులకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భీమవరం ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ ఎం.అచ్యుత్ అంబరీష్, గ్రామ సర్పంచి తిరుమల యామినీ దేవి, జిల్లా అటవీ శాఖాధికారి డి.ఆశ కిరణ్, డ్వామా ఎపీడీ పి.సుజాత, తహశీల్దార్ రావి రాంబాబు, ఎంపిడిఒ కె.వెంకటలక్ష్మి, మండలాధ్యక్షులు మేకా శ్రీనివాసరావు, రావూరి లాజర్, స్థానిక ప్రజాప్రతినిధులు కె.నాగేశ్వరరావు, శేఖర్, రమేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా ఎందుకు అడగరు..?

కూటమి ప్రభుత్వానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం సూటి ప్రశ్న

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం



మాట్లాడుతున్న మంతెన సీతారాం

పొత్తులతో అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ అధికారంలోకి వచ్చిన టిడిపి, జనసేన, బిజెపిలు మన రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఎందుకు అడగడం లేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం ప్రశ్నించారు. ఆ పార్టీ జిల్లా విస్తృత సమావేశం శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథి మంతెన సీతారాం మాట్లాడుతూ కేంద్రంలో తక్కువ సీట్లే సాధించి భాగస్వాములపై ఆధారపడి టిడిపి సహకారంతో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి తన నిరంకుశత్వ, మతోన్మాద విధానాలను శరవేగంగా అమలు చేస్తుందని విమర్శించా. రాజ్యాంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసే ప్రయత్నాలు వేగవంతం చేసిందన్నారు. రాష్ట్రం విడిపోయి పదేళ్లు పూర్తయిన కాలంలో అధికారంలో ఉన్నది బిజెపినే అని గుర్తుచేశారు. టిడిపి కూటమిపై ఆధారపడిన మోడీ మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తారని రాష్ట్ర ప్రజలు భావిస్తే, కూటమి పార్టీలు మాత్రం మోడీకి శిరస్సు వంచి జనం ఆశలు అడియాశలు చేశాయని ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి అప్పుగా ఇచ్చిన నిధులతోనే టిడిపి కూటమి సంబరపడిపోవడం హాస్యాస్పదమన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రత్యేక హోదా, పోలవరం నిధుల సాధన, విశాఖ రైల్వేజోన్, కడప ఉక్కు వంటి ప్రధానమైన డిమాండ్లను నెరవేర్చడానికి ఎందుకు సిద్ధపడటం లేదని ప్రశ్నించారు. ఇప్పటివరకు ఒక్కసారి కూడా ప్రత్యేక హోదాను అడగకపోవడం అంటే రాష్ట్ర ప్రజలను మోసం చేయడమేనన్నారు. గత వైసిపి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం తెచ్చిన అన్ని చట్టాలను అమలు చేసే ప్రజల తిరస్కరణకు గురైందని గుర్తు చేశారు. ఇప్పుడు టిడిపి కూటమి ప్రభుత్వం కూడా అదే బాటలో వెళ్లడం ఆందోళనకరమన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లను పెట్టాలనే ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ఇవ్వాల్సిన అన్ని హక్కులను పోరాడి సాధించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలను సమీకరించి ఐక్య ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

జ్వర పీడిత ప్రాంతాల్లో ప్రత్యేక మెడికల్ క్యాంపులు పెట్టాలి
సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

జిల్లాలో డెంగీ, మలేరియా, సీజనల్ జ్వరాలతో ప్రాణాలు కోల్పోవడం ఆందోళనకరమని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. ఎన్నడూ లేనంతగా జిల్లాలో జ్వరాలు ప్రబలి జనం ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ముంపు ప్రాంతాల్లో కాలుష్యం అరికట్టాలన్నారు. ఎప్పటికప్పుడు శానిటేషన్ పనులు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం పకడ్బందీగా చేపట్టాలని కోరారు. దళితులకు శ్మశాన వాటికలు కేటాయించాలన్నారు. మైదాన ప్రాంత గిరిజనులైన యానాదులు, చెంచులు, ఎరుకల కాలనీల అభివృద్ధిపై మరింత దృష్టి సారించాలని కోరారు. వర్షాల వల్ల నష్టపోతున్న రైతులను ఆదుకోవాలని బలరాం విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు, చింతకాయల బాబూరావు, కేతా గోపాలన్, డి.కళ్యాణి, పివి.ప్రతాప్, బి.వాసుదేవరావు, కౌరు పెద్దిరాజు, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో వైద్యశిబిరాలు నిర్వహించాలి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - నరసాపురం




పరిపాలనాధికారి పెద్దిరాజుకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

పెరుగుతున్న డెంగీ, మలేరియా వంటి విష జ్వరాల కారణంగా పాఠశాలలు, ప్రభుత్వ వసతిగృహాల్లో విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారని, తక్షణం ఆయా ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి డి.అనిల్‌బాబు అన్నారు. శుక్రవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో కార్యాలయ పరిపాలనాధికారి సిహెచ్.పెద్దిరాజుకు, తహశీల్దార్ టి.రాజరాజేశ్వరికి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా డి.అనిల్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు జ్వరాలతో అల్లాడుతున్నారని, వారికి తక్షణం మెరుగైన వైద్యం అందించాలని కోరారు. జిల్లా కమిటీ సభ్యురాలు ఈదా సన మాట్లాడుతూ విద్యాలయాలు, హాస్టళ్లలో వైద్య శిబిరాలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

ఒపిఎస్ పునరుద్ధరించే వరకూ పోరు

యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి

యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్‌ను వ్యతిరేకిస్తూ నిరసన



భీమవరంలో తహశీల్దార్‌కు వినతి అందిస్తున్న నేతలు

ప్రజాశక్తి - భీమవరం

పాత పెన్షన్ విధానం (ఒపిఎస్)ను పునరుద్ధరించే వరకూ పోరాటం ఆగదని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. కేంద్ర కేబినెట్ ప్రకటించిన యూనిఫైడ్ పెన్షన్స్ స్కీమ్ (యూపిఎస్)కు వ్యతిరేకంగా భీమవరంలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయం నుంచి ఉపాధ్యాయులు, నేతలు తహశీల్దార్ కార్యాలయం వరకు జోరు వర్షంలో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం తహశీల్దార్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ తక్షణం ఒపిఎస్ అమలుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ పునరుద్దరించాలని ఆందోళనలు సాగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఇలా యూపిఎస్‌ను ముందుకు తీసుకురావడం దారుణమన్నారు. ఒపిఎస్ మినహా తమకు మరేదీ అంగీకారం కాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి సిహెచ్.పట్టాభిరామయ్య, జిల్లా కార్యదర్శులు కెఎస్‌సిహెచ్.సాయిరామ్, సిహెచ్.కుమారబాబ్జి, డి.ఏసుబాబు, జి.రామకృష్ణంరాజు, కె.రామకృష్ణప్రసాద్, నేతలు జి.అబ్రహం, బి.నాగబాబు, కె.త్రిమూర్తులు, ఎస్.గోవింద్, మల్లుల శ్రీనివాస్, కె.వామనమూర్తి, జి.శంకర్‌బాబు పాల్గొన్నారు.

నరసాపురం : యుపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ స్కీంను అమలు చేయాలని యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.మార్కండేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్ టి.రాజరాజేశ్వరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మార్కండేయులు మాట్లాడుతూ పోరాటాల ద్వారా సాధించుకున్న పాత పెన్షన్ స్కీమ్ ఉద్యోగుల హక్కు అని భిక్షకాదని తెలిపారు. పాత పెన్షన్ కావాలని, 20 ఏళ్లుగా ఉద్యోగ, ఉపాధ్యాయుల పోరాటం ఫలితంగా కొన్ని రాష్ట్రాల్లో పాత పెన్షన్ పునరుద్ధరిస్తూ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. తక్షణం పాత పెన్షన్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి.కృష్ణకుమారి, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు పి.శ్రీనివాస్, నరసాపురం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్‌వి.సత్యన్నారాయణ, ఎస్.అజయ్‌కుమార్, సిపిఎస్ డివిజనల్ కన్వీనర్ పి.శాంసన్, పట్టణ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.మాణిక్యాలరావు, ఎన్.చంద్రకుమార్ పాల్గొన్నారు.



నరసాపురంలో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

తణుకు : పెన్షన్ అనేది ఉద్యోగుల హక్కు తప్ప ఎవరి దయతోనే ఇచ్చేది కాదని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి టిజె.జయకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన తెలియజేసి తహశీల్దార్ అశోక్‌వర్మకు వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా జయకుమార్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ కంట్రీబ్యూషన్ లేని పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2004 జనవరి నుంచి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, 2004 సెప్టెంబరు 1 నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు న్యూ పెన్షన్ స్కీమ్ అమలు చేస్తున్నాయన్నారు. గత ప్రభుత్వం సిపిఎస్ కంటే మెరుగైనదని, జిపిఎస్ పెన్షన్‌ను అమలు చేయాలని ప్రయత్నించిందని తెలిపారు. దాన్ని ఉద్యోగ, ఉపాధ్యాయులు తిరస్కరించారని, ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే ధోరణి అవలంబిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆగస్టు 22న కేంద్రం క్యాబినెట్‌లో ఆమోదించిన యుపిఎస్ పెన్షన్ విధానం వల్ల కార్పొరేట్ సంస్థలకు లబ్ధిచేకూర్చే విధంగా ఉంది తప్ప ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎటువంటి లాభం లేదని వాపోయారు. అంకెల గారడీని తలపించే యుపిఎస్ పెన్షన్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.వీరన్న, వివి.సాగర్, రవి పాల్గొన్నారు.



తణుకు: తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నేతలు

హిడెన్ కెమెరాలపై సమగ్ర విచారణ చేపట్టాలి

గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాలలో నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలి

ఎస్ఎఫ్ఐ, ఐద్వా డిమాండ్

ప్రజాశక్తి - భీమవరం

కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాలలో హిడెన్ కెమెరాలపై విచారణ చేపట్టాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.ఈశ్వర్, టి.ప్రసాద్ ఒక ప్రకటన విడుదల చేశారు. గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం అర్ధరాత్రి విద్యార్థినుల హాస్టల్‌లో హిడెన్ కెమెరాలు ఏర్పాటు చేయడం తీవ్ర ఆందోళనకు గురిచేసిందని తెలిపారు. యాజమాన్యం పరిరక్షణా లోపం దీనికి ప్రధాన కారణమని వాపోయారు. ఇది విద్యార్థినుల మానప్రాణాలకే ప్రమాదమని పేర్కొన్నారు. ఉన్నత చదువుల కోసం కళాశాలకు వస్తున్న విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు తప్ప రక్షణ గురించి ఆలోచించకుండా యాజమాన్యం వ్యవహరించిందని తెలిపారు. వీడియోలు రికార్డ్ చేయబడ్డాయన్న అనుమానాలను కూడా విద్యార్థినులు లేవనెత్తారని, వాటిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. విషయాన్ని బయటకు పొక్కకుండా కళాశాల యాజమాన్యం తీరు సిగ్గుచేటని తెలిపారు. ఈ ఘటనతో విద్యార్థులకు కళాశాలలు ఎలాంటి విలువలు నేర్పిస్తున్నాయనే ప్రశ్న లేవనెత్తుతోందని తెలిపారు. వెంటనే ఘటనపై ఉన్నతస్థాయి కమిటీ వేయాలని కోరారు. ఇలాంటి ఘటనలు కళాశాలలో పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. కళాశాలలో రాజకీయ అండదండలు ఉన్నాయన్న విమర్శలు కూడా వస్తున్న నేపథ్యంలో బాధ్యులు ఎంతటి వారైనా కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

స్త్రీలకు రక్షణ కరువు : ఐద్వా

ఆకివీడు : కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీలోని మహిళల బాత్‌రూమ్‌లో సీక్రెట్ కెమెరాలు పెట్టిన ఉదంతంపై నేటికీ ఏ ఒక్కరూ స్పందించకపోవడంపై ఐద్వా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సంతక ఉదయకుమారి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ వారం రోజుల క్రితం ఈ విషయాన్ని మేనేజ్‌మెంట్ దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఇప్పటి వరకూ కాలేజీ యాజమాన్యం నుండి గానీ ప్రభుత్వం వైపు నుంచి గానీ చర్యలు తీసుకోలేదన్నారు. విద్యార్థులు, మహిళలు బయటకొచ్చి ఆందోళన చేస్తున్నా కారకులపై చర్యలు తీసుకోకపోవడాన్ని ఆమె తప్పుబట్టారు. ఎక్కడా స్త్రీలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. రోజురోజుకూ మహిళల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందన్నారు. వీటన్నింటికీ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళా సంఘం అధ్యక్షులు డోకల.లక్ష్మి మాట్లాడుతూ సంఘటనకు కారణమైన మద్యం, మత్తు పదార్థాల సరఫరాపై ప్రభుత్వం తక్షణం విచారణ జరపాలని డిమాండ్ చేశారు. వెంటనే మద్యం, మత్తు పదార్థాల సరఫరాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వీడియోలు బయటకు రాకుండా నిలుపుదల చేయాలని, సహకరించిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

బాల్య వివాహాలను అరికట్టే బాధ్యత అందరిదీ

ప్రజాశక్తి - ఆచంట

బాల్య వివాహాలను అరికట్టే బాధ్యత గ్రామ కమిటీలతో పాటు ప్రతి ఒక్కరిపైనా ఉందని సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్ తెలిపారు. కొడమంచిలి సచివాలయంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం బాల్య వివాహాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామ్ మాట్లాడుతూ చిన్న వయసులోనే బాల్య వివాహాలు చేయడం వలన పలు అనారోగ్య సమస్యలకు గురవుతారన్నారు. బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమన్నారు. బాల్య వివాహాలపై తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ డివిఎస్ సూర్యకుమారి, గ్రామ కార్యదర్శి డి.నాని, విఆర్ఒ నరసింహరాజు, ఎఎన్ఎంలు డి.పుష్పరాజ్యం, వెంకటరమణ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

మాధవనాయుడుని కలిసిన సిఐ యాదగిరి

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం నూతన సిఐగా బాధ్యతలు చేపట్టిన యాదగిరి మాజీ ఎంఎల్ఎ బండారు మాధవ నాయుడును శుక్రవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాధవనాయుడు సిఐ యాదగిరికి అభినందనలు తెలిపారు. పట్టణంలో శాంతిభద్రతలు అదుపులో ఉండే విధంగా చూసుకోవాలని సూచించారు.

నరసాపురం మున్సిపల్ కమిషనర్‌గా అంజయ్య

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం మున్సిపల్ కమిషనర్‌గా ఎం.అంజయ్యను నియమిస్తూ ప్రభుత్వం గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన పుట్టపర్తి మున్సిపాల్టీ నుంచి బదిలీపై ఇక్కడకు వస్తున్నారు. ఇప్పటివరకూ ఇక్కడ పని చేసిన కె.వెంకటేశ్వర్లును ప్రభుత్వం ఒంగోలు కమిషనర్‌గా నియమించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఇన్‌ఛార్జి కమిషనర్‌గా డిఇ రమేష్ బాబు ఉన్నారు.

పౌరులు హక్కులు పొందాలి

ప్రజాశక్తి - కాళ్ల



మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాసరావు

సమాజంలోని పౌరులందరూ తమ హక్కులను పొందాలని ఎస్ఐ ఎన్.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కోలనపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం పౌర హక్కుల దినోత్సవం (సివిల్ రైట్స్ డే) సందర్భంగా అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి తహశీల్దార్ నాగార్జున మాట్లాడుతూ ప్రతి పౌరుడూ తమ హక్కులను వినియోగించుకోవడంతో పాటు ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ సదస్సులో గ్రామ సర్పంచి కొనకంచి సూర్యనారాయణ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న సభ్యులు

ఆర్యవైశ్య కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పాలకోడేరు

విస్సాకోడేరుకు చెందిన మండ సోమేశ్వరరావు, అతని భార్య, కుమారుడు కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆకివీడు మండల ఆర్యవైశ్య సంఘం తరుపున సన్నిధి రామ వెంకటేశ్వరరావు, గొట్ల గణపతి, గుర్రం శ్రీనివాస్‌రావు, సంఘం సభ్యులంతా సేకరించిన రూ.లక్షా ఐదు వేలను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు చిర్లం చెర్ల సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి కందిగట్ల రఘురాం, ఉపాధ్యక్షులు కోడూరి కుమార్, శ్రీనివాసరావు, సన్నిధి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు, కేరేజీల పంపిణీ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వృద్ధులను ఆదుకోవడం స్ఫూర్తిదాయకమని జోన్ ఛైర్‌పర్సన్ లయన్ బండి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం పడాల జీవన సంధ్య వృద్ధాశ్రమంలో తాడేపల్లిగూడెం డైమండ్స్ లయన్స్ సభ్యులు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సేవా కార్యక్రమాన్ని జిల్లా లయన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు ప్రారంభించారు. 100 మంది వృద్ధులకు అన్నదానం, వస్త్రదానం, వస్తు దానం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వృద్ధులు, అనాథల ఆకలి తీర్చే విధంగా లయన్స్ హంగర్ రిలీఫ్ పేరుతో జిల్లా వ్యాప్తంగా సేవలందుతున్నాయని జోన్ ఛైర్‌పర్సన్ లయన్ బండి వెంకటేశ్వరరావు తెలిపారు. న్యూ క్లబ్స్ కో ఆర్డినేటర్ లయన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు మాట్లాడారు. లయన్స్ సేవల్లో భాగంగా కర్రి చంద్రకుమారి, రామకృష్ణ జయంతి సందర్భంగా వారి కుమారుడు లియో కర్రి సురేష్ కుమార్ వృద్ధులకు సాయం అందించడాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అనంతరం అతిథుల చేతుల మీదుగా వృద్ధులకు ఆహారం, దుప్పట్లు, స్టీలు క్యారేజీలు, పండ్లు, రస్క్ పేకెట్స్ అందజేశారు.

ఎలక్ట్రిక్ కారు దగ్ధం

ఎంపిపి వాసురెడ్డికి తృటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని బ్రాహ్మణచెర్వు వద్ద గురువారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో ఎంపిపి కర్రి వెంకట నారాయణ రెడ్డి (వాసు) తృటిలో ప్రమాదం నుంచి బయటపడ్డారు. పాలకొల్లులో సొంత పనులు ముగించుకొని ఎంపిపి వాసు రెడ్డి తమ స్వగ్రామం ఎస్ఐ.పర్రు తన ఎలక్ట్రికల్ కారు నడుపుకుంటూ వస్తున్నారు. గురువారం రాత్రి 11 గంటలు దాటిన తరువాత బ్రాహ్మణ చెర్వు పిల్ల కాల్వ మలుపు వద్ద కారులో మంటలు రావడంతో వెంటనే ఆయన అప్రమత్తమై కారు దిగిపోయారు. కాసేపటికి అత్తిలి నుండి ఫైర్ ఇంజన్ వచ్చి, మంటలు అదుపులోకి తెచ్చారు. కారు విలువ రూ.15 లక్షలు అని ఆయన చెప్పారు. ఆయన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

పిల్లలను పనిలో పెట్టొద్దు

ప్రజాశక్తి - మొగల్తూరు

పిల్లలను పనిలో పెట్టుకోవడం నేరమని కార్మిక శాఖ అధికారులు దుకాణదారులకు సూచించారు. మండల కేంద్రం మొగల్తూరులోని దుకాణాలను ఆ శాఖ అధికారులు శుక్రవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా దుకాణ యజమానులతో మాట్లాడారు. కార్యక్రమంలో పాలకొల్లులోని కార్మిక శాఖ సహాయ అధికారి కెబిఆర్ శర్మ , తణుకు ఒకటో విభాగ కార్మిక శాఖ అధికారి ఎం.కిరణ్ కుమార్ తదితరులు ఉన్నారు.


దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న అధికారులు

పచ్చని మొక్కలతో అందరికీ ఆరోగ్యం

ప్రజాశక్తి - ఆచంట



నరసాపురం : మొక్కలునాటుతున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్, నేతలు

పచ్చని చెట్ల వల్ల ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు అందరికీ ఆరోగ్యంగా ఉంటుందని ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి అన్నారు. వనమహోత్సవంలో భాగంగా శుక్రవారం మండలంలో ఆచంట, కొడమంచిలి, పెదమల్లం, కోడేరు, కరుగోరుమిల్లి, కందరవల్లి, భీమలాపురం, వల్లూరు, పెనుమంచిలి, ఆచంట వేమవరం, శేషమ్మచెరువు, అయోధ్యలంక గ్రామాల్లో అధికారులు, ప్రజా ప్రతినిధులు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామాల్లో రహదారికి ఇరువైపులా, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సూర్యకుమారి, సీతారాం మాట్లాడారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, ఎంపిడిఒ పాల్గొన్నారు.

నరసాపురం : మొక్కలతోనే మానవాళి మనుగడ ముడిపడి ఉందని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అన్నారు. వనమహోత్సవంలో భాగంగా శుక్రవారం ఆయన రైల్వే స్టేషన్ వద్ద మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రె శ్రీ వెంకట రమణతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పాలూరి బాబ్జి, అడిదల శ్యామల, నాయకులు ఘంటా కృష్ణ, జక్కం శ్రీమన్నారాయణ, కొల్లు పెద్దిరాజు, కొప్పాడి రవీంద్ర, ఎఇ మణి పాల్గొన్నారు. అలాగే లింగనబోయిన చర్ల సచివాలయం వద్ద వన మహోత్సవం నిర్వహించారు. పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు పలుచోట్ల కూటమి నాయకులు మొక్కలు నాటారు. తోట చిన్న, కటకంశెట్టి సంజీవ రావు, మామాజీ, గోవర్ధన్ పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్: పాలకొల్లు రూరల్ పంచాయతీ కార్యాలయ పరిధిలో వనమహోత్సవంలో భాగంగా శుక్రవారం మొక్కలు నాటారు. సీనియర్ టిడిపి నాయకులు పాముల రజనీ కుమార్, పంచాయతీ మాజీ సర్పంచి గడ్డ ఏడుకొండలు, రాంబాబు, అధికారులు మొక్కలు నాటారు.

పెనుమంట్ర : పర్యావరణ పరిరక్షణలో మొక్కలు బాసటగా నిలుస్తాయని భట్లమగుటూరు సర్పంచి బయ్యే సుగుణమ్మ, ఉప సర్పంచి లక్ష్మీపతిరాజు అన్నారు. పంచాయతీ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ బోర్డు మెంబర్స్, గ్రామ సెక్రటరీ సుబ్బలక్ష్మి, గ్రామ పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జనసేన గ్రామ అధ్యక్షుడు బయ్యే బాలాజీ మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి అధ్యక్షులు జంగం చిట్టిబాబు, బిజెపి అధ్యక్షులు పేర్రాజు, గంటా శ్రీను, గడ్డం శ్రీను, జనసేన పాల్గొన్నారు. అలాగే నెగ్గిపూడి, మార్టేరు, నెలమూరు, ఓడూరు, పొలమూరు తదితర గ్రామాల్లో ఆయా పంచాయతీలు, ఎన్ఆర్ఇజిఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

ఉండి : హరిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు అన్నారు. మండలంలో వన మహోత్సవం నిర్వహించారు. మహదేవపట్నంలో సర్పంచి వనిమా నాగ వెంకట సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జుత్తిగ నాగరాజు పాల్గొని మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. అనంతరం మహదేవపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమాల్లో వాంద్రం సర్పంచి దాసరి వెంకట కృష్ణ, ఎన్ఆర్‌పి అగ్రహారం సర్పంచి సూరవరపు కనకదుర్గ వెంకటాచార్యులు, ఉనుదుర్రు సర్పంచి పిన్నమరాజు నాగలక్ష్మి, ప్రజా ప్రతినిధులు మొక్కలు నాటారు.

మొగల్తూరు : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎంపిడిఒ ఉండు బాబ్జీ రాజు సూచించారు. వన మత్సవంలో భాగంగా మండలంలోని గ్రామ పంచాయతీల్లో మొక్కలు నాటారు. మొగల్తూరులోని పంచాయతీ చెరువు గట్టు చుట్టూ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, నాయకులు పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యం, సృజనాత్మకత వెలికితీతే లక్ష్యం

ఎపి నిట్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ అసోసియేట్ డీన్ డాక్టర్ వి.సందీప్

స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం


మాట్లాడుతున్న డీన్ డాక్టర్ సందీప్

విద్యార్థుల్లో దాగి ఉన్న సాంకేతిక నైపుణ్యం, సృజనాత్మక ఆలోచనలను వెలికితీయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ కార్యక్రమాన్ని ప్రారంభించిందని ఎపి నిట్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ అసోసియేట్ డీన్ డాక్టర్ వి.సందీప్ తెలిపారు. అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఎఐసిటిఇ), విద్యామంత్రిత్వ శాఖ (కేంద్ర ప్రభుత్వం) సంయుక్త ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో నిర్వహిస్తున్న స్మార్ట్ ఇండియా హ్యాకథాన్-2024పై శుక్రవారం విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ఆచార్యులు కర్రి ఫణికృష్ణ కోఆర్డినేటర్‌గా, డాక్టర్ వి.సందీప్, డాక్టర్ పి.శంకర్ మెంటర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు అంకుర పరిశ్రమలను ఏర్పాటుచేసి పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ప్రతి విద్యార్థీ వినూత్న ఆలోచనలు, ప్రాజెక్టులతో ముందుకు రావాలన్నారు. సెప్టెంబర్ 9న నిర్వహించే ఇంటర్నల్ కాంపిటేషన్ కార్యక్రమానికి 30 టీమ్‌లు వరకు తమ పేర్లను నమోదు చేసుకునే అవకాశాలున్నాయని చెప్పారు. నవంబరులో కేంద్ర ప్రభుత్వం గ్రాండ్ ఫైనల్ నిర్వహించి విజేతల వివరాలను ప్రకటిస్తుందని తెలిపారు. విద్యార్థులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పరిశ్రమలు ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లపై వినూత్న పరిష్కార మార్గాల అన్వేషణకు కృషి చేయాల్సి ఉంటుందని, ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ లక్ష, ద్వితీయ స్థానం సాధించిన టీమ్‌కు రూ.50 వేల చొప్పున నగదు బహుమతులను కేంద్ర ప్రభుత్వం అందజేయనుందని తెలిపారు.

వైఎన్‌లో చిన్న తరహా పరిశ్రమలపై అవగాహన

ప్రజాశక్తి - నరసాపురం

విద్యార్థులు పట్టుదలతో చదవి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని వాసవి ఐస్ ఫ్యాక్టరీ, రాజమహేంద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల అధినేత గుడివాడ సాయి రాధాకృష్ణ తెలిపారు. స్థానిక వైఎన్ కళాశాల ఇ సెమినార్ హాల్లో శుక్రవారం చిన్నతరహా పరిశ్రమల దినోత్సవం సందర్భంగా ఇన్నోవేషన్స్, ఎంట్రీప్రెన్యూర్ డెవలప్మెంట్ సెంటర్, ఐక్యుఎసి ఆధ్వర్యంలో సంయుక్తంగా చిన్నతరహా పరిశ్రమలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా వాసవీ ఐస్ ఫ్యాక్టరీ, రాజమహేంద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల అధినేత గుడివాడ సాయి రాధాకృష్ణ, అమరాన్ బెట్రీస్ డీలర్ సురేష్ విచ్చేసి మాట్లాడారు. చిన్న తరహా పరిశ్రమల స్థాపనకు విద్యార్థులు కృషి చేయాలన్నారు. రిస్క్ తీసుకునే తత్వం ఉండాలని, నష్టాలు కష్టాలకు బెదరని మనస్తత్వం ఉండాలని తెలిపారు. సెల్ఫ్ మోటివేషన్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్.కనకారావు, డీన్ గంధం శ్రీరామకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ బెజవాడ వెంకట రత్నం పాల్గొన్నారు.


పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేసిన జనసేన నాయకులు

పారిశుధ్య కార్మికులకు చీరల పంపిణీ

ప్రజాశక్తి - ఆచంట

జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకుని ఆచంట నియోజకవర్గంలో ఐదు రోజుల పాటు వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి చిట్టూరి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం రెండో రోజు వల్లూరులో పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు సేవా కార్యక్రమాలు చేస్తూ ఆయన పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో, పట్టణాల్లో పారిశుధ్య కార్మికుల సేవలు అమోఘమన్నారు. కార్యక్రమంలో జనసేన గ్రామ అధ్యక్షులు కడిమి ఉమామహేశ్వరస్వామి, మండలం ఉపాధ్యక్షులు తోట ఆదినారాయణ, మండల కార్యదర్శి కె.రామకృష్ణ పాల్గొన్నారు.

ఉద్యాన రంగంలో సాంకేతికతపై శిక్షణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో శుక్రవారం వర్చువల్ మోడ్‌లో రెసిలెంట్ అగ్రికల్చర్ హయ్యర్ ఎడ్యుకేషన్ సిస్టమ్ ప్రాజెక్ట్ కింద ఉద్యాన రంగంలో సుస్థిరత కోసం సాంకేతిక ప్రమేయంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం, ఇతర విశ్వవిద్యాలయాల్లో అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంటర్న్‌షిప్ విద్యార్థుల ప్రయోజనం కోసం ఈ శిక్షణా కార్యక్రమం మిశ్రమ జ్ఞానార్జన వేదికగా నిర్వహించినట్లు తెలిపారు. శుక్రవారం ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వైఎస్ఆర్ ఉద్యాన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కె.గోపాల్ మాట్లాడారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ బి.శ్రీనివాసులు, డీన్ ఆఫ్ పీజీ స్టడీస్ సూర్య కుమారి పాల్గొన్నారు.

వాసవీ ఆత్మార్పణంపై ప్రభుత్వం ప్రకటనపై హర్షం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ కార్యక్రమాన్ని ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహించడం పట్ల ఆర్యవైశ్య వర్తక సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, ఆర్యవైశ్య మండల సంఘం హర్షం ప్రకటించారు. శుక్రవారం ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సంఘం అధ్యక్షులు వబిలిశెట్టి వెంకటేశ్వరరావు, జూలూరి వెంకటేష్, కంచర్ల వెంకట రమణరావు, జనసేన రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి వబిలిశెట్టి రామకృష్ణ మాట్లాడారు. వాసవి కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణంను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని గతంలో అనేకసార్లు కోరామని తెలిపారు. ఈ మేరకు డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌కు భీమవరంలో జనసేన రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి వబిలిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వచ్చిన తర్వాత అమ్మవారి కార్యక్రమాన్ని అధికారికంగా ప్రకటించడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. అనంతరం రామకృష్ణను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ పెరుమాళ్ల శివ, తటవర్తి పవన్, బోండా నిషాంత్, పులవర్తి కాశీ, మండా చంద్రశేఖర్ పాల్గొన్నారు.

విషపుటీగల గూడు కాల్చివేత

ప్రజాశక్తి - నరసాపురం


విషపుటీగల గూడు కాలుస్తున్న దృశ్యం

మండలంలోని రుస్తుంబాదలో ఆస్పత్రి ఎదురుగా రోడ్డు పక్కన మామిడి చెట్టుకు విషపు టీగల పట్టు గూడు కట్టిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని స్థానికులు సర్పంచి బందెల భారతి దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో గోనె సంచులు, పెట్రోల్ ఉపయోగించి మంట పెట్టి పట్టును పూర్తిగా కాల్చివేశారు. గురువారం రాత్రి సర్పంచి ఆధ్వర్యంలో తూర్పుతాళ్లకు చెందిన దుర్గా ప్రసాద్ విషపు టీగల తుట్టెను కాల్చివేశారు.

దోమల వ్యాప్తిని అరికట్టాలి

ప్రజాశక్తి - తణుకు రూరల్

డెంగీ, చికెన్ గున్యా తదితర జ్వరాల వ్యాప్తికి కారకాలైన దోమల నివారణ చర్యలు ప్రతి ఇంటా పాటించేలా సిబ్బంది అవగాహన కల్పించాలని అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ టి.శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం తణుకు మండలం కొమరవరం గ్రామంలో నిర్వహించిన ప్రాథమిక చికిత్సా కేంద్రాన్ని ఆయన సందర్శించి సిబ్బందికి సూచనలిచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలో దోమల నివారణపై ర్యాలీ నిర్వహించారు. కలుషిత నీరు తాగడం వల్ల టైఫాయిడ్, అతిసార, కామెర్లు వస్తాయని వివరించారు. వేడివేడి ఆహారం, కాచి చల్లార్చిన నీటినే తీసుకోవాలని, నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు తీసుకోరాదని ర్యాలీ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు, వేల్పూరు పిహెచ్‌సి వైద్యాధికారి కెఎంఆర్.కిషోర్, హెల్త్ సూపర్‌వైజర్ ఎ.శ్రీరామమూర్తి, ఎంఎల్‌హెచ్ పివి.శాంతి పాల్గొన్నారు.


ఆచంటలో కురుస్తున్న వర్షం

జిల్లాలో పలుచోట్ల వర్షం

ప్రజాశక్తి - ఆచంట

అల్పపీడన ప్రభావంతో శుక్రవారం ఉదయం నుంచి మండలంలో చిరుజల్లులు కురుస్తున్నాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు ఒకింత ఇబ్బందులకు గురయ్యారు. వర్షాల కారణంగా జన సంచారం పెద్దగా లేక రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. రాగల 24 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఇన్‌ఛార్జి తహశీల్దార్ డి.సుగుణసంధ్య తెలిపారు.

మొగల్తూరు: మండలంలో శుక్రవారం తెల్లవారుజాము నుండి వర్షం ఏకధాటిగా కురుస్తోంది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులుపై వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఉదయం నుంచి వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది.

పాలకొల్లు: పట్టణంలో శుక్రవారం ఉదయం నుంచి జల్లులు పడుతున్నా మధ్యాహ్నం నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురుస్తోంది. దీంతో ప్రజాజీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. డ్రెయిన్లు, రోడ్లు ఏకమయ్యాయి. వర్షం ప్రభావంతో కొనుగోళ్లు లేక దుకాణాలు వెలవెలబోయాయి.


ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచండి

ప్రజాశక్తి - గణపవరం

గ్రామంలో ప్రతి శుక్రవారమూ ఫ్రైడే డ్రైడే నిర్వహించి ప్రజలు గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సిహెచ్ అగ్రహారం సర్పంచి చుక్కా అప్పారావు అన్నారు శుక్రవారం కాశిపాడు ఆరోగ్య ఉప కేంద్రం వైద్య సిబ్బంది నిర్వహించిన ఫ్రైడే డ్రైడే ర్యాలీ లో పాల్గొని మాట్లాడారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం వల్ల దోమలను అరికట్టవచ్చని తెలిపారు. దోమల వల్ల డెంగీ, మలేరియా వంటి రోగాలు వస్తాయని చెప్పారు. ఎవరికైనా జ్వరం, తలనొప్పి వంటి లక్షణాలు ఉంటే పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామకృష్ణుడు, ఆరోగ్య సహాయకులు నామాల రాజు, పిప్పర సెక్టార్ అంగన్వాడీ సూపర్ వైజర్ సిహెచ్ దుర్గాభవాని పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

భీమవరం టౌన్: మావుళ్లమ్మ అమ్మవారి శాశ్వత నిత్యాన్నదానానికి విరాళంగా భీమవరానికి చెందిన అయితం శ్రీనివాస్ నాగలక్ష్మి దంపతులు వారి కుమార్తె ప్రణతి పేరుమీద రూ. లక్షా నూట పదహార్లు శుక్రవారం అందజేశారు. వారికి ఆలయ ఉప ప్రధానార్చకులు కొప్పేశ్వరరావు పూజలు నిర్వహించి ప్రసాదాలు, శేషవస్త్రం, ఫొటో అందచేసినట్లు ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ తెలిపారు.

'మున్సిపాల్టీలో కలుషిత నీరు సరఫరా'

నరసాపురం: నరసాపురం మున్సిపాల్టీలో తాగునీరు దుర్వాసన వస్తోందని బిజెపి నరసాపురం నియోజకవర్గ కన్వీనర్ మేకల సతీష్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మున్సిపాల్టీ ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతోందన్నారు. ఈ నీరు తాగి ప్రజలు డయేరియా, అతిసార బారిన పడుతున్నారన్నారు. ముఖ్యంగా పొన్నపల్లి, స్టీమర్ రోడ్డులో ఈ సమస్య ఉందన్నారు. ఈ నీరు వాడుకోవడానికి కూడా పనికి రావన్నారు. దీనిపై నరసాపురం ఆర్‌డిఒ ఎం.అచ్యుత్ అంబరీష్‌కు, మున్సిపల్ ఎఇ సునీల్‌కు ఫిర్యాదు చేశానన్నారు. మున్సిపల్ పాలకవర్గం, అధికారులు బాధ్యత తీసుకుని వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు.

దుబాయ్‌లో పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - నరసాపురం

జనసేన అధినేత, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు దుబాయ్‌లో జనసేన టీమ్ ఆధ్వర్యంలో ఈ నెల 31న నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ పాల్గొనున్నారు. శుక్రవారం నాయకర్ దుబాయ్ ఎయిర్‌పోర్టుకు చెరుకున్నారు. దుబాయ్ జనసేన టీమ్ వారు నాయకర్‌కు ఘన స్వాగతం పలికారు.